తల్లి మందలించిందని విద్యార్థిని ఆత్మహత్య

రాయదుర్గం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): తల్లి మందలించిందని భవనంపై నుంచి దూకి బాలిక ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... పంచవటి కాలనీలోని ఎస్ఎంఎస్ ఇన్‌ఫ్రాలో నివాసముండే సురేందర్, శ్రీలక్ష్మి దంపతుల కుమార్తె మనస్విని(13) స్థానికంగా నెక్నాపూర్‌లోని ఓ స్కూల్‌లో 8వ తరగతి చదువుతోంది. మంగళవారం స్కూల్‌కు లంచ్‌బాక్సు తీసుకెళ్లి తినకుండా తీసుకొచ్చింది. బాలిక తల్లి ఈ మధ్య ఎందుకు సరిగా అన్నం తినడం లేదు... మార్కు సైతం తక్కువగా వస్తున్నాయని మందలించింది. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులందరూ రాత్రి భోజనం చేసి నిద్రించిన తర్వాత తీవ్ర మనస్థాపానికి గురైన బాలిక అర్ధరాత్రి 1 గంట సమయంలో అపార్ట్‌మెంట్ మూడో అంతస్తు నుంచి కిందకు దూకి ఆత్మహత్య చేసుకుంది. వెంటనే కుటుంబ సభ్యులు గుర్తించి బాలికను స్థానిక ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్టు తెలిపారు. కుటుంబ సభ్యులు రాయదుర్గం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

పేట్‌బషీరాబాద్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో యువతి మృతి చెందింది. దూలపల్లి గ్రామంలో సంజన ఇంటర్‌లెక్చ్యాలో నివాసముంటున్న బి.రామారావు కూతురు పూజిత(22) డిగ్రీ పూర్తి చేసింది. రెండు సంత్సరాలుగా ఇంటి వద్దనే ఉంటోంది. డిగ్రీలో ఒక సబ్జెక్ట్ బ్యాక్‌లాక్ ఉండడంతో మనస్థాపానికి గురై బెడ్‌రూంలో చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గమణించిన తల్లి ఉమాదేవి పూజితను కిందికు దించి సూరారంలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతి చెందిందని తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపడుతున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి..

దుండిగల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. అన్నారం ప్రాంతంలో నివాసముంటున్న శ్రీకాంత్ (32)అడ్డా మీది కూలి. బుధవారం ఉదయం మట్టి రోడ్డు మీదుగా కూలి పనులకు వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈప్రమాదంలో శ్రీకాంత్ మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న దుండిగల్ పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కంటైనర్ ఢీకొని మహిళ..

దుండిగల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): కంటైనర్ ఢీకొనడంతో మహిళ మృతి చెందింది. డీపోచంపల్లి గ్రామానికి చెందిన రామకృష్ణ భార్య అండాలు(38) బుధవారం దుండిగల్ సమీపంలో రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన కంటైనర్ ఢీకొట్టింది. దీంతో ఆమె మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించారు. దుండిగల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ జాయింట్ సీపీ నారాయణ నాయక్

హైదరాబాద్ సిటీ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో (జనవరి-15 నుంచి ఫిబ్రవరి- 14 వరకు)భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ నారాయణనాయక్ ఆధ్వర్యంలో స్కూల్ నిర్వాహకులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బుధవారం సైబరాబాద్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన ఈకార్యక్రమానికి ట్రాఫిక్ అధికారులు, స్కూల్ నిర్వాహకులు హాజరయ్యారు. స్కూల్ ఎదుట ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. విద్యార్థులను దించడానికి, తీసుకెళ్లడానికి వచ్చే తల్లిదండ్రుల వాహనాలు, ఆటోలు, రోడ్ల మీద ఆపకుండా.. స్కూల్ ఆవరణలో దించేలా, అక్కడినుంచే పికప్ చేసేలా ఏర్పాట్లు చేయడం, పార్కింగ్ ఏర్పాట్లు స్కూల్ ఆవరణలో లేకుంటే.. పరిసరాల్లో స్థలాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. స్కూల్ బస్సు డ్రైవర్ల లైసెన్స్‌లు, వారి ఆరోగ్య పరిస్థితిని గమనించడం.. తరచూ వారికి డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల్లో, డ్రైవర్లలో అవగాహన కల్పించడానికి స్కూళ్లలోనూ రోడ్ సేఫ్టీ కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమైతే ట్రాఫిక్ పోలీసుల దృష్టికి తీసుకురావాలని నారాయణ నాయక్ కోరారు.

అంబేడ్కర్ జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వినతి పత్రం అందజేసిన నాగరాజు, సంఘం నాయకులు

బాలానగర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్. అంబేడ్కర్ జీవిత చరిత్రను 6వ తరగతి నుంచి పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. అంబేడ్కర్ యువజన సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు కర్క.నాగరాజు ఆధ్వర్యంలో సంఘం నాయకులు బుధవారం ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే ఢిల్లీలోని పాఠ్యపుస్తకాల్లో అంబేడ్కర్ జీవిత చరిత్రను చేర్చారని వారు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీకాంత్, సదామహేశ్, సాయి జక్కుల అశోక్ పాల్గొన్నారు.

డ్రైవర్లకు అభినందనలు



కూకట్‌పల్లి ఆర్టీసీ డ్రైవర్లకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న డిప్యూటీ ఆర్ఎం కవిత

ఫతేనగర్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రయాణీల ప్రాణాలకు భద్రత కల్పించేది డ్రైవర్లేనని ఆర్టీసీ సికింద్రాబాద్ రీజియన్, కూకట్‌పల్లి డిప్యూటీ ఆర్ఎం కవిత అన్నారు. కూకట్‌పల్లి డిపోలో ఏర్పాటు చేసిన డ్రైవర్స్ డే కార్యక్రమంలో డిపో డ్రైవర్లకు ఆమె అభినందనలు తెలియజేసి భద్రతా ప్రమాణాల పట్ల పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో డీఎం ఇస్సాక్, ట్రాఫిక్ ఇన్‌చార్జి శ్రీలత, ఎం.ఎఫ్ రమాదేవి, డ్రైవర్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని డివిజన్లలో బుధవారం ప్రజా ప్రతినిధులు, నాయకులు పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని స్థానికులకు వారు హామీ ఇచ్చారు.



ఔట్‌లెట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

మియాపూర్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారాని కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. బుధవారం మాదాపూర్ డివిజన్ అపర్ణకౌంటి ఔట్‌లెట్ సమస్యలను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అపర్ణకౌంటి ఔట్‌లెట్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు డీఈ నళిని, ఏఈ పావని, ఆర్ఐ శ్రీనివాస్, మాదాపూర్, హఫీజ్‌పేట డివిజన్ల అధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్, బాలింగ్ గౌతంగౌడ్, నాయకులు మల్లేష్‌గౌడ్, స్థానికులు పాల్గొన్నారు.

చందానగర్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకెళ్తున్నామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. బుధవారం ఆయన చందానగర్‌లోని రాజేంద్రరెడ్డినగర్, కృష్ణదేవరాయకాలనీలో కార్పొరేటర్ మంజులరెడ్డి, ఇంజనీరింగ్, జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. రాజేంద్రరెడ్డికాలనీలో అమీన్‌పూర్ మున్సిపాలిటీ నుంచి వచ్చే మురుగునీరు నాలాలోకి లింకు కలపకుండా వదిలేయడంతో రాజేంద్రరెడ్డికాలనీ రోడ్లపైకి మురుగునీరు వస్తోందని, ఈ సమస్యను అమీన్‌పూర్, శేరిలింగంపల్లి, అధికారులు సమన్వయంతో పనిచేస్తే సమస్య పరిష్కారం అవుతుందని, ఆదిశగా చర్యలు తీసుకోవాలన్నారు. కృష్ణదేవరాయకాలనీలో పలు సమస్యలు స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దశల వారీగా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో డీఈ శ్రీకాంతి, జలమండలి డీజీఎం సుబ్రమణ్యంరాజు, డివిజన్ అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



బాలయ్యబస్తీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

గాజులరామారం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలకు తాను ఎప్పుడూ రుణపడి ఉంటానని, అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీ అందించారని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. నియోజకవర్గంలో చేపట్టిన కృతజ్ఞత యాత్రలో భాగంగా గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి, నాయకులతో కలిసి ఆయన కృతజ్ఞతా యాత్ర చేపట్టారు. మహిళలు పెద్ద ఎత్తున మంగళహారతులతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేట్‌బషీరాబాద్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల డివిజన్ దండమూడి ఎన్‌క్లేవ్‌లోని ఆయన కార్యాలయంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను పలువురు నాయకులు, కార్యకర్తలు, సంక్షేమ సంఘం నాయకులు కలిసి బస్తీలో నెలకొన్న సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. కొందరు అభిమానులు ఆయన ఫొటో ఫ్రేమ్‌ను అందజేశారు. అనంతరం గౌడ శంఖారావం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో గౌడ శంఖారావం సంఘం సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు లక్ష్మారెడ్డి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

● నిజాంపేట్ కార్పొరేషన్ కేటీఆర్ కాలనీ నెలకొన్న ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన కేటీఆర్ కాలనీ ప్రజలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు తమ సమస్యలను ఆయనకు వివరించారు. అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం హన్మంత్‌రెడ్డితో పాటు సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను కాలనీ వాసులు శాలువాలతో సన్మానించారు.

- నిజాంపేట్, జనవరి 24(ఆంధ్రజ్యోతి)





న్యూకాలనీలో సమస్యలు పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీకాంత్

మియాపూర్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మియాపూర్ న్యూకాలనీలో సమస్యల పరిష్కారం, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ బుధవారం అధికారులతో కలిసి పాదయాత్ర చేశారు. కాలనీలో త్వరలో చేపట్టబోయే సీసీరోడ్లు, యూజీడీ పనులను నాణ్యతతో గడువులోగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బీఎస్ఎన్ కిరణ్‌యాదవ్, వరలక్ష్మి, లావణ్య, బీఎస్ఎన్ సాయియాదవ్, రాజేష్, తిమ్మరాజు, వెంకటేష్‌గౌడ్, శంకర్, కాలనీ వాసులు పాల్గొన్నారు.



డ్రైనేజీ మరమ్మతులు చేయిస్తున్న కార్పొరేటర్ రోజాదేవి

వివేకానందనగర్‌కాలనీ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): వివేకానందనగర్‌కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను బుధవారం కార్పొరేటర్ మాధవరం రోజాదేవి పరిశీలించారు. డ్రైనేజీ వ్యవస్థలో లోపాలు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. సమస్యను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, అధికారులు వెంకటేశ్వర్లు, ప్రియాంక, ఆశ, గురువారెడ్డి, సుదర్శన్, కాలనీవాసులు పాల్గొన్నారు.



వసంతరావును అభినందిస్తున్న కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

బాలానగర్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): బాలానగర్ డివిజన్ పరిధి కల్యాణ్‌నగర్‌లో ఇటీవల జరిగిన ఎన్నికల్లో కల్యాణ్‌నగర్ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన వి.వసంత్‌రావు బుధవారం కార్పొరేటర్ రవీందర్‌రెడ్డిను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వసంతరావును కార్పొరేటర్ శాలువాతో సత్కరించారు. బస్తీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి జనరల్ సెక్రెటరీ చంద్రపాల్, కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ గౌతమ్

పేట్‌బషీరాబాద్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ రూల్స్ పాటించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని, డ్రైవింగ్‌లో సెల్‌ఫోన్ మాట్లాడకూడదని మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ వాహనదారులకు సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా మేడ్చల్ కలెక్టర్ కార్యాలయంలో కరపత్రాలు, బ్యానర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ప్రతి సంవత్సరం ఐదు లక్షల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈప్రమాదాల వల్ల లక్షా యాభైవేల మంది చనిపోతున్నారని తెలిపారు. కొందరు గాయాలతో ఆస్పత్రి పాలవుతున్నారని, రోజుకు 13 వందల మంది రోడ్డు ప్రమాదాలవల్ల చనిపోతున్నారని అన్నారు. రాష్ట్రంలో 20 వేల రోడ్డు ప్రమాదాలు సంబవిస్తే అందులో ఆరు వేల మంది చనిపోతు న్నారని, 20 వేలకు మించి తీవ్రంగా గాయాలపాలవుతున్నారని చెప్పారు. ప్రతి వ్యక్తి డ్రైవింగ్‌ను అనుభవంగా కాక, సామాజిక బాధ్యతగా చేసినప్పుడే ప్రమాదాలను అరికట్ట వచ్చన్నారు. ట్రాఫిక్ రూల్స్‌ను తప్పని సరిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ డీటీఓ కిషన్ నాయక్, మోటారువెహికల్ ఇనిస్పెక్టర్లు ఎస్‌వీఎన్ ప్రతాప్‌రాజు, రవికుమార్, జి.మహేష్, ఎల్.త్రివేణిభాయ్, చిరంజీవి, అమృతవర్షిణి, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

● రాష్ట్ర ఇన్‌కమ్‌ట్యాక్స్ ప్రిన్సిపల్ కమిషనర్ సుధాకర్‌రావు

గచ్చిబౌలి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): చిన్నవయస్సు నుంచే పరిసరాల శుభ్రత పాటించేలా అలవర్చుకోవాలని రాష్ట్ర ఇన్‌కమ్‌ట్యాక్స్ ప్రిన్సిపల్ కమిషనర్ సుధాకర్‌రావు అన్నారు. బుధవారం గచ్చిబౌలి ఉన్నత పాఠశాలల్లో రాష్ట్ర ఇన్‌కమ్‌ట్యాక్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ భారత్ కార్యక్రమాకి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులతో కలిసి పరిసరాలు శుభ్రం చేసి మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదివానని, తన తల్లికూడా ప్రభుత్వ పాఠశాల టీచర్ అని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు కూడా ప్రైవేటు పాఠశాలలకు దీటుగా క్రమశిక్షణతో చదవడంతో పాటు పరిసర ప్రాంతాలు, ఇంటి దగ్గర స్వచ్ఛత పాటిస్తూ అనారోగ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ ఏజీబీ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకునేందుకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు రీమాయాదవ్, ముదిలేయర్, దుర్గాప్రసాద్, పురుషోత్తంరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● సెక్రటేరియెట్‌లో బుధవారం విద్యాశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, కొంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రశాంత్‌గౌడ్, మాజీ సర్పంచ్ జిమ్మి దేవేందర్, తదితరులు

- పేట్‌బషీరాబాద్, జనవరి 24(ఆంధ్రజ్యోతి)



నేడు జేఎన్‌టీయూలో జాతీయ ఓటరు దినోత్సవం

● హాజరు కానున్న గవర్నర్ తమిళిసై

హైదరాబాద్ సిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జేఎన్‌టీయూలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వర్సిటీ ప్రజా సంబంధాల అధికారి పి.ప్రసన్న తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మేడ్చల్ జిల్లా రెవెన్యూ విభాగం సంయుక్తంగా ఈకార్యక్రమాన్ని చేపట్టాయని ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, విశిష్ట అతిథులుగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారధి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వికాస్‌రాజ్, జీహెచ్ఎంసీ కమిషనర్, మేడ్చల్‌జిల్లా కలెక్టర్ గౌతమ్, పలువురు జేఎన్‌టీయూ ఉన్నతాధికారులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

'రియల్'లో స్థిరమైన పెరుగుదల

● క్రెడాయ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ రాజశేఖర్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో స్థిరమైన పెరుగుదల కనిపిస్తోందని క్రెడాయ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో మార్చి 8 నుంచి 10 వరకు నిర్వహిస్తున్న కాన్ఫడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) హైదరాబాద్ ప్రాపర్టీ షో వివరాలను బుధవారం రాజశేఖర్‌రెడ్డి వెల్లడించారు. గతేడాది నవంబర్‌లో నివేదించబడిన ఆస్తి లావాదేవీల్లో గణనీయమైన పెరుగుదల కనిపించిందన్నారు. 2022 సంవత్సరంతో పోల్చితే 2023 నవంబర్‌లో ప్రాపర్టీ డీల్స్‌లో 25 శాతం పెరుగుదల ఉందని అన్నారు. సమావేశంలో ప్రాపర్టీ షో కన్వీనర్, వైస్ ప్రెసిడెంట్ కొత్తపల్లి రాంబాబు, ఉపాధ్యక్షులు ప్రదీప్‌రెడ్డి, మురళీమోహన్, శ్రీకాంత్, కోశాధికారి మనోజ్‌కుమార్ అగర్వాల్, సంయుక్త కార్యదర్శులు నితీష్‌రెడ్డి, క్రాంతికిరణ్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

60 ఏళ్ల మహిళకు మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్స



చికిత్స చేయించుకున్న మహిళతో డైరెక్టర్ ఆదిత్య కపూర్

హైదరాబాద్ సిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మోకాళ్ల మార్పిడికి ప్రస్తుతం ఫ్రాన్స్‌లో అందుబాటులో ఉన్న అత్యాధునిక "3డి ఆగ్మెంటేడ్ రియాలిటీ-గ్లాసెస్" టెక్నాలజీతో 60 ఏళ్ల మహిళకు మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తిచేసినట్టు ఒమేగా ఆస్పత్రి డైరెక్టర్ ఆఫ్ ఆర్థోపెడిక్స్ డా. ఆదిత్య కపూర్ తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో ఈ టెక్నాలజీతో నిర్వహించిన మొదటిశస్త్ర చికిత్స అని బుధవారం ఆస్పత్రిలో నిర్వహించిన సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంగళవారం శస్త్ర చికిత్స నిర్వహించిన మహిళను బుధవారం డిశ్చార్జ్ చేసినట్లు తెలిపారు. కేవలం ఒక రోజులో పూర్తిగా కోలుకుని నడవగలుగుతున్నారన్నారు.

నేడు కవి సమ్మేళనం

హైదరాబాద్ సిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా ఆకాశవాణి ప్రతి యేటా ప్రసారం చేసే సర్వభాషా కవి సమ్మేళనం గురువారం రాత్రి 10గంటలకు ప్రసారమవుతుందని ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం విభాగం అధిపతి వి.ఉదయ్‌శంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కవి సమ్మేళనంలో తెలుగు కవి డా.మల్లెగోడ గంగాప్రసాద్ 'వలస జీవి' కవితతో పాటు వివిధ భాషల కవితలకు అనువాదాలు ప్రసారమవుతాయన్నారు. జనవరి 5 రాంచీలో నిర్వహించిన ఆకాశవాణి సర్వ భాషా కవిసమ్మేళనంలో పాల్గొన్న 22భాషల కవుల కవితలను తెలుగులోకి అనువాదం చేయించి ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం రూపొందించిన కార్యక్రమం తెలుగు రాష్ట్రాల్లో అన్ని కేంద్రాల ద్వారా ప్రసారమవుతుందని తెలిపారు.

18 మంది ఎస్సైల బదిలీ

హైదరాబాద్ సిటీ: సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 18 మంది ఎస్సైలను బదిలీ చేస్తూ కమిషనర్ అవినాశ్ మహంతి ఉత్తర్వులు జారీ చేశారు. వివిధ విభాగాలు, పోలీస్‌స్టేషన్లలో పని చేస్తున్న ఎస్సైలు వెంటనే బదిలీ అయిన చోట చేరాలని ఆదేశించారు.

వాహనాల వేలం

హైదరాబాద్ సిటీ: ఎవరూ క్లెయిమ్ చేయని వివిధ కేసుల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న 544 వాహనాలను వేలం వేయనున్నట్టు సైబరాబాద్ పోలీసులు తెలిపారు. వివరాల కోసం 9490617317ను సంప్రదించాలన్నారు.

హిట్ అండ్ రన్!

(5వ పేజీ తరువాయి)

కోసం ప్రయత్నిస్తుండగా బుధవారం మధ్యాహ్నం ఆ కారు(హ్యుండయ్ వెర్నా) ఎస్ఆర్‌నగర్ పోలీసుస్టేషన్ వద్ద హఠాత్తుగా ప్రత్యక్షమైంది. ఆ కారు అక్కడికి ఎలా వచ్చింది? అనేది పోలీసులు కూడా చెప్పలేకపోతున్నారు. మరోపక్క, ఈ కేసుకు సంబంధించి ద్వారంపూడి నాగ అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. కారు నడిపిన నాగ ఓ రాజకీయ నాయకుడి బంధువు అని ప్రచారం జరుగుతోంది. మరోపక్క, పోస్టుమార్టం అనంతరం తారక్ రామ్ మృతదేహాన్ని బుధవారం సాయంత్రం తర్వాత జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్ వద్దకు తీసుకొచ్చి అతడి బంధువులు ఆందోళనకు దిగారు. నిందితులను తప్పించే ప్రయత్నం చేస్తున్నారంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

చారిత్రక ఘట్టాలకు వేదికగా గోల్కొండ



చిరంజీవితో కలిసి జ్యోతిప్రజ్వలన చేస్తున్న కిషన్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎన్నో చారిత్రాత్మక ఘట్టాలకు వేదిక గోల్కొండ అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. యాదాద్రి భక్తులకు ఎంఎంటీఎస్ రైలు సేవలు అందుబాటులోకి తెస్తామని చెప్పారు. గోల్కొండ కోటలో 3డీ మ్యాప్ ప్రొజెక్టర్, హై రెజల్యూషన్ లైట్స్ షోను రాజ్యసభ సభ్యుడు విజయేంద్ర ప్రసాద్, సినీ నటుడు చిరంజీవితో కలిసి మంత్రి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌ను సందర్శించే ప్రతి ఒక్కరూ గోల్కొండను వీక్షించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో లేజర్ షో ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ షో తెలుగు, హిందీ, ఇంగ్లీష్‌లో ఉంటుందని, మన సంస్కృతి, చరిత్ర గురించి దీని ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు. 1400 ఎల్ఈడీ లైట్లతో నిత్యం దేదీప్యమానంగా గోల్కొండ వెలుగొందేలా ఏర్పాట్లు చేశామన్నారు.

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర మరో బ్రాంచి ప్రారంభం



హయత్‌నగర్ బ్రాంచిని ప్రారంభిస్తున్న బ్యాంకు అధికారులు

హైదరాబాద్ సిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర హయత్‌నగర్ శాఖను బుధవారం హైదరాబాద్ జోన్ జోనల్ మేనేజర్ సుశాంత్ కుమార్ గుప్తా, డిప్యూటీ జోనల్ మేనేజర్ మహమ్మద్ షజీబ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రోహిత్ రిషిలు ప్రారంభించారు.. హోటల్ రాజధాని కాంప్లెక్స్, ఆటోనగర్‌లో ప్రారంభమైన ఈ శాఖ కస్టమర్లకు అందుబాటులోకి వచ్చింది. భారతదేశంలో 28 రాష్ట్రాలు, 5 కేంద్రపాలిత ప్రాంతాలలో 2200 కంటే ఎక్కువ శాఖలతో 30 మిలియన్ల కస్టమర్లకు సేవలందిస్తోందని... తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 33 జిల్లాల్లో 64 శాఖలున్నట్లు బ్యాంకు అధికారులు తెలిపారు.

రూ.లక్షకు ఐదు లక్షలు

(5వ పేజీ తరువాయి)

యాడ్ చేశారు. డిసెంబర్ 29న రోలెక్స్ హైదరాబాద్‌లోని మెహిదీపట్నం వచ్చారు. నల్లటి కలర్‌లో ఉన్న బ్లాక్ కరెన్సీని వారి వద్ద ఉన్న కెమికల్‌లో కడిగి అది ఒరిజినల్ రూ. 500 నోటుగా మారడాన్ని కళ్లకు కట్టినట్లు చూపించారు. రూ. లక్షకు రూ. 5 లక్షలు బ్లాక్‌కలర్ కరెన్సీ ఇస్తామని చెప్పడంతో విష్ణువర్ధన్‌రెడ్డి అంగీకరించాడు. సరిగ్గా వారం రోజుల్లోనే బాధితుడు రూ. 5లక్షలు రెడీ చేసుకున్నాడు. విషయం డేవిడ్‌కు చెప్పడంతో ఈ ఏడాది జనవరి 5న డేవిడ్ ప్రతినిధులైన మరో ఇద్దరు జోసెఫ్, కోంబి ఫ్రాంక్ సెడ్రిక్‌లు మాదాపూర్‌లోని ఒక హోటల్లో దిగారు. విషయం తెలుసుకున్న బాధితుడు రూ. 5లక్షలు తీసుకొని హోటల్‌కు వెళ్లాడు. అక్కడ రూ. 5లక్షలు తీసుకున్న జోసెఫ్, కోంబి ఫ్రాంక్ సెడ్రిక్‌లు ఒక ట్రంక్ పెట్టెను విష్ణు చేతికి ఇచ్చారు. అందులో రూ. 25 లక్షల విలువైన బ్లాక్ కలర్ కరెన్సీ ఉందని చూపించారు. అదే సమయంలో ఒక రకమైన పౌడర్‌ను విష్ణువర్ధన్ కూర్చున్న చోట చల్లడంతో మగతకు గురయ్యాడు. అనంతరం ఆ ట్రంక్‌పెట్టెను తీసుకొని విష్ణు ఇంటికి వెళ్లి కెమికల్‌లో ముంచి ఎంత క్లీన్ చేసినా తెల్లకాగితాలే వస్తున్నాయి.. కానీ, కరెన్సీ నోటు కాలేదు. దాంతో బాధితుడు మోసపోయినట్లు గుర్తించి షాకయ్యాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీపీ ఆదేశాలతో మల్కాజిగిరి ఎస్‌వోటీ పోలీసులు రంగంలోకి దిగారు. టెక్నికల్ ఎవిడెన్స్ సేకరించి ముఠాలోని కోంబీ ఫ్రాన్స్ సెడ్రిక్, గోయిటా సౌన్‌గాలోను అరెస్టు చేశారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు.చాకచక్యంగా విదేశీ ముఠాను పట్టుకున్న మల్కాజిగిరి ఎస్‌వోటీ ఇన్‌స్పెక్టర్ రాము టీమ్‌ను, డీసీపీ గిరిధర్, ఏసీపీ వాసులను సీపీ అభినందించారు.

564 మంది అరెస్ట్

ఆఫ్రికన్ దేశాలకు చెందిన 564 మంది గత మూడేళ్లలో దేశవ్యాప్తంగా మోసాలకు పాల్పడినట్లు గణాంకాలు చెబుతున్నాయని రాచకొండ పోలీసులు వెల్లడించారు. ఆఫ్రికన్ దేశాల ఎకానమీలో పదిశాతం మోసాలతో సంపాదించిన డబ్బు ఉంటుందన్నారు.

నగరం మరింత అద్భుతంగా..

(5వ పేజీ తరువాయి)

పేర్కొన్నారు.బార్కస్‌లో 50 పడకల ఆస్పత్రిని నిర్మించేందుకు రూ.9.50 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు.

అధునాతన ఫిష్ మార్కెట్..

నగరంలో కూరగాయలతో కలిపి అధునాతనమైన అతిపెద్ద ఫిష్ మార్కెట్‌ను నిర్మిస్తామన్నారు. గత ప్రభుత్వం హైదరాబాద్ కలెక్టరేట్ భవన నిర్మాణాన్ని పట్టించుకోలేదని, తమ ప్రభుత్వం తప్పకుండా దీనిపై దృష్టి సారిస్తుందని, విశాలమైన స్థలంలో ఎవరూ ఊహించని విధంగా భారీ సముదాయాన్ని నిర్మిస్తామని చెప్పారు.

రేషన్‌కార్డులకు 10 లక్షల దరఖాస్తులు..

జిల్లాలో రేషన్‌కార్డులకు 10 లక్షల మంది, మరో 3 లక్షల మంది గ్యాస్, మహాలక్ష్మి, తదితర పథకాలకు దరఖాస్తు చేసుకున్నారని మంత్రి తెలిపారు.అర్హులందరికీ తప్పకుండా న్యాయం చేస్తామని పేర్కొన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి హోదాలో ప్రతీ నియోజకవర్గానికి రూ.10 కోట్లు కేటాయిస్తానని తెలిపారు. త్వరలో జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి సమీక్ష నిర్వహిస్తామన్నారు. 58, 59 జీవోలను అడ్డుపెట్టుకుని గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లాలో ల్యాండ్ బ్యాంక్‌ను కాపాడే విషయంపై తహసీల్దార్లకు తగిన సూచనలిస్తామన్నారు. సమీక్షలో భాగంగా మంత్రి పొన్నం పలు శాఖల అధికారులపై స్వల్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. సమీక్షలో హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అడిషనల్ కలెక్టర్ మధుసూదన్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, తదితరులు పాల్గొన్నారు.